



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి నిమ్మల, టీడీపీ జిల్లా అధ్యక్షుడు రామరాజు, మాజీ ఎమ్మెల్సీ అంగర, ఎమ్మెల్సీ అభ్యర్థి రాజశేఖరం

ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు

మంత్రి నిమ్మల రామానాయుడు

పాలకొల్లు టౌన్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): రానున్న ఐదేళ్లలో యువతకు 20 లక్షల ఉద్యోగాలు కల్పించాలన్న ధ్యేయంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రణాళిక సిద్ధం చేశారని మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. పాలకొల్లు టీడీపీ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. డీఎస్సీ ద్వారా 16వేల ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేస్తామని తెలిపారు. ఎమ్మెల్సీ అభ్యర్థి రాజశేఖరం, టీడీపీ జిల్లా అధ్యక్షుడు మంతెన రామరాజు, మాజీ ఎమ్మెల్సీ అంగర రామమోహన్, గవర కార్పొరేషన్ చైర్మన్ ఎం.సురేంద్ర, నియోజకవర్గ పరిశీలకుడు చంద్రమౌళి, ప్రాజెక్టు కమిటీ చైర్మన్ మురళీ కృష్ణంరాజు, కూటమి నాయకులు పాల్గొన్నారు. అనంతరం బీఆర్‌ఎంవీఎం హైస్కూల్, ధర్మారావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత డీఎస్సీ కోచింగ్ సెంటర్లోని యువతను కలిసి రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం కోసం రాజశేఖరానికి తొలి ప్రాధాన్య ఓటు వేసి గెలిపించాలని మంత్రి నిమ్మల రామానాయుడు కోరారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదిక రద్దు

భీమవరం టౌన్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికను తాత్కాలికంగా రద్దు చేశారు. జిల్లా, డివిజన్, మండల కార్యాలయాల్లో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికను (పీజీఆర్ఎస్) జిల్లా అంతట తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ నాగరాణి తెలిపారు.



టీడీఆర్ బాండ్‌లు ఫోర్జరీ

తాడేపల్లిగూడెంలో టీడీఆర్ బాండ్‌ల మంజూరులో మరో అంశం తెరపైకి వచ్చింది. ఫోర్జరీ సంతకాలతో బాండ్‌లను మంజూరు చేశారు. మున్సిపాలిటీకి స్థలాలు రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చిన స్థల యజమానుల సంతకాలకు, బాండ్‌లు జారీ సమయంలో చేసిన సంతకాలకు పొంతన లేదు.! టీడీఆర్ బాండ్‌లపై దర్యాప్తు చేయడానికి విజిలెన్స్ అధికారులు రంగంలోకి దిగారు. సమగ్ర నివేదికను సిద్ధం చేస్తున్నారు.

- 18 మందికి ఫోర్జరీ బాండ్‌లు మంజూరు
- రూ. కోట్లలో లబ్ధి పొందిన వైసీపీ నేత
- అధికారుల తప్పిదాలు బహిర్గతం
- నివేదికలు సిద్ధం చేస్తున్న విజిలెన్స్
- సీబీసీఐడీ విచారణకు అవకాశం
- భయపడుతున్న అక్రమార్కులు
- కూటమి నేతల చుట్టూ ప్రదక్షిణ

తాడేపల్లిగూడెం మున్సిపాల్టీ అక్రమాల్లో మరో కోణం

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

తాడేపల్లిగూడెంలో టీడీపీ బాండ్‌లు మంజూరు చేసిన స్థలాలను గడచిన మూడు రోజులుగా విజిలెన్స్ అధికారులు పరిశీలించారు. స్థల యజమానులను సంప్రదించి వివరాలు నమోదు చేసుకున్నారు. బాండ్‌ల మంజూరులో అధికారులు చేసిన తప్పిదాలు ఇప్పుడు బహిర్గతమవుతున్నాయి. కేవలం వైసీపీ నేతకు మేలు చేయాలన్న తలంపుతో బాండ్‌లు ఇచ్చేశారు. బలైపోయామంటూ కూటమి నేతల వద్ద లబోదిబోమంటున్నారు. మాస్టర్ ప్లాన్ రహదారుల్లో స్థలాల రిజిస్ట్రేషన్ నుంచి బాండ్‌లు మంజూరు వరకు జరిగిన ప్రక్రియపై విజిలెన్స్ దృష్టి సారించింది. ప్రభుత్వానికి నివేదికను సమర్పించనున్నారు. తదుపరి ప్రభుత్వ నిర్ణయం మేరకు సీబీసీఐడీని నియమించే అవకాశాలున్నాయి. ఇప్పటికే తణుకులో జారీ అయిన బాండ్‌లపై సీబీసీఐడీ విచారణ చేపడుతోంది. తాడేపల్లిగూడెంలోనూ సీబీసీఐడీ రంగంలోకి దిగితే కఠిన చర్యలు తప్పవని అధికారులు భయపడుతున్నారు. బాండ్‌లు జారీచేసిన వారంతా ఇతర మున్సిపాలిటీల్లో, శాఖల్లో విధులు నిర్వహిస్తున్నారు.

మహిళలకు అన్యాయం!

తాడేపల్లిగూడెం పట్టణంలోని తాళ్ల ముదునూరుపాడులో 3200 గజాల స్థలంలో అపార్ట్‌మెంట్ నిర్మాణానికి బిల్డర్‌తో మహిళలు ఒప్పందం చేసుకున్నారు. మహిళల పేరుతో సదరు స్థలం ఉంది. దాంట్లో 1000 గజాల స్థలం మాస్టర్ ప్లాన్ రహదారిలో ఉండడంతో బిల్డర్‌కు వక్రబుద్ధి పుట్టింది. తాడేపల్లిగూడెం-భీమవరం రహదారికి ఆనుకుని ఉన్న 1000 గజాల స్థలం మున్సిపాలిటీకి ఇవ్వాలని స్థల యజమానులైన మహిళలను ఒప్పించారు. అందుకు నాలుగురెట్లు టీడీఆర్ బాండ్‌లు ఇస్తారు. వాటిని అపార్ట్‌మెంట్‌లోనే వినియోగించి అభివృద్ధి చేస్తామని నమ్మించారు. రెండో ఒప్పందంలో ఆ మేరకు లిఖితపూర్వకంగా రాసుకున్నారు. కానీ మున్సిపాలిటీ ఇచ్చిన బాండ్‌లను మార్కెట్‌లో విక్రయించేశారు. అపార్ట్‌మెంట్ నిర్మించకుండా మహిళలను బిల్డర్ మోసం చేశారు. బాండ్‌ల అమ్మకంలో దాదాపు రూ. 3.50 కోట్లు లబ్ధి చేకూరింది. వైసీపీ నేతకు కొంతమొత్తాన్ని ముట్టచెప్పగా స్థలం ఇచ్చిన మహిళలు మోసపోయారు. బిల్డర్ పేరుతో బాండ్‌లను మంజూరు చేయడం నిబంధనలకు విరుద్ధమైనా అప్పటి మున్సిపల్ అధికారులు పట్టించుకోలేదు. ఇప్పుడు విజిలెన్స్ అధికారుల విచారణలో స్థల యజమానులైన మహిళలకు అన్యాయం జరిగిందని గుర్తించారు. దాంతో స్థల యజమానులతో రాజీ కుదుర్చుకోవడానికి లబ్ధిపొందిన బిల్డర్, బ్రోకర్‌లు ప్రయత్నాలు ప్రారంభించారు. బాండ్‌లు జారీచేసిన అధికారులు సైతం కాళ్ల బేరానికి వచ్చారు.

నేతకు లబ్ధి.. అధికారులకు శిక్ష!

వైసీపీ హయాంలో అక్రమంగా జారీచేసిన టీడీఆర్ బాండ్‌లపై తాడేపల్లిగూడెంలో విజిలెన్స్ అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. బాండ్‌లు జారీ అయిన 18 మంది నుంచి వివరాలు సేకరించి నివేదికను సిద్ధం చేస్తున్నారు. బాండ్‌లు జారీలో ఫోర్జరీ సంతకాలపైనా విజిలెన్స్ అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. మున్సిపల్ అధికారుల నుంచి రికార్డులను స్వాధీనం చేసుకుని విచారణ చేపట్టారు. వైసీపీ హయాంలో దాదాపు 40 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో బాండ్‌లు మంజూరయ్యాయి. వాటి విలువ దాదాపు రూ.150 కోట్లు. మార్కెట్‌లో 40శాతానికి బాండ్‌లను విక్రయించి రూ.60 కోట్ల మేర లబ్ధిపొందారు. వైసీపీ నేతకు పెద్ద మొత్తంలో సొమ్ములు అందగా రాష్ట్ర స్థాయి అధికారులకు లబ్ధి చేకూరినట్లు ఆరోపణలు. ప్రస్తుతం బాండ్‌లు మంజూరు చేసిన అధికారులు బలికానున్నారు. బాండ్‌ల మంజూరులో తప్పిదాలు దొర్లాయి. స్థలాలు స్వాధీనం చేసుకోలేదు. మున్సిపాలిటీకి రాసిచ్చిన స్థలాల్లో ఇప్పటికీ షాపులను నిర్వహిస్తున్నారు. భీమవరం పట్టణానికి చెందిన బ్రోకర్ బాండ్‌ల జారీలో కీలకంగా వ్యవహరించారు. వైసీపీ నేత రూ.2.00 కోట్లు మేర బ్రోకర్‌కు ఇచ్చేలా మంతనాలు సాగినా సొమ్ము ఇవ్వలేదు. ఇద్దరి మధ్య ఇప్పుడు అంతరం ఏర్పడింది. ఇదికూడా విజిలెన్స్ విచారణలో బహిర్గతమైంది.



ఎమ్మెల్సీ పోలింగ్‌కు కసరత్తు

ఆరు జిల్లాల్లో 2 వేల మందికి ఎన్నికల విధులు

ఈనెల 22న తుది విడత శిక్షణ

7



చికెన్‌కు చిక్కులు

వెలవెలబోయిన దుకాణాలు

జోరుగా మటన్, చేపలు, రొయ్యల విక్రయం

బావాయిపాలెంలో యువకుడి

దారుణ హత్య



చేయి నరికి తీసుకువెళ్లిన దుండగులు

పోలీసుల విచారణ 7

పుష్కర పనులపై కదలరే..!



రాష్ట్ర విభజన అనంతరం గోదావరి పుష్కరాలను అప్పటి టీడీపీ ప్రభుత్వం భారీగా నిర్వహించింది. గోదావరిలో పుణ్యస్నానాలకు దేశ నలుమూలల నుంచి లక్షలాది మంది భక్తులు ఉభయ గోదావరి జిల్లాలకు తరలివచ్చారు. రాజమండ్రి, కొవ్వూరు తరువాత అత్యధిక మంది భక్తులు నరసాపురంలోనే పుణ్యస్నానాలు అచరించారు. 12 రోజులపాటు జరిగిన ఈ మహోత్సవంలో అప్పట్లో పట్టణంలోని ఘాట్‌ల్లో కోటి మందిపైనే స్నానమాచరించినట్లు అంచనా.

క్షేత్రస్థాయిలో ప్రతిపాదనలపై అధికారుల ఉదాసీనత

- రాష్ట్రస్థాయిలో ఉన్నతాధికారుల సమీక్షలు
- స్థానికంగా పట్టించుకోని అధికారులు
- పురపాలక శాఖ మొద్దు నిద్ర
- ట్రాన్స్‌కో రూ.18 కోట్లు, ఏటిగట్టు శాఖ రూ.15 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం

నరసాపురం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): గోదావరి నది గత పుష్కరాలకు భక్తుల రద్దీని ముందుగానే ఊహించి పనులు చేపట్టడంతో ఇబ్బందులు తలెత్తలేదు. 2027 జూలైలో పుష్కరాలకు కూడా ప్రభుత్వం అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేసింది. ముఖ్యమంత్రి, పురపాలక శాఖ మంత్రి అధికారులతో పలుమార్లు సమీక్షలు నిర్వహించారు. మంత్రి నారాయణ మూడు పర్యాయాలు రాజమండ్రిలో అధికారులతో సమావేశమయ్యారు. కలెక్టర్ నాగరాణి నరసాపురం ప్రాంతంలో చేపట్టాల్సిన పనులపై సమీక్ష నిర్వహించి ప్రతిపాదనలు అందించాలని ఆదేశించారు. కొన్ని శాఖలు మొద్దు నిద్ర వీడలేదు. స్నానాల రేవులు, లైటింగ్, డ్రసింగ్‌రూమ్, రోడ్లు, రవాణ సౌకర్యం, వసతి, ఆలయాల దర్శనంపై ఏ పనులు చేపట్టాలి, అంచనా వ్యయం ఎంత, తదితర ప్రతిపాదనలు వివిధ శాఖలు అందించాల్సి ఉంది. ఇంతవరకు కొన్నిశాఖలు ప్రతిపాదనలు సిద్ధం చేయలేదు.

గతంలో రూ.200 కోట్ల పనులు

2015లో గోదావరి పుష్కరాలకు అప్పటి టీడీపీ ప్రభుత్వం రూ.200 కోట్ల పనులకు ఆమోద ముద్ర వేసింది. పురపాలక సంఘానికి సంబంధించి రూ.70 కోట్లు ఉన్నాయి. తరువాత ఆర్అండ్‌బి రెండో స్థానంలో నిలిచింది. దాదాపు రూ.50 కోట్ల పనులకు అనుమతి లభించింది. ఆ పుష్కర పనుల్లోనే నరసాపురం-మత్స్యపురి రహదారి రూ.25 కోట్లతో అభివృద్ధి చేశారు. పంచాయితీరాజ్ చేపట్టిన పనుల్లో చిన మామిడిపల్లి నుంచి పాలకొల్లు మండలం దిగమర్రు వరకు కాల్వ రోడ్ ఉంది. పురపాలక ఏటిగట్టును మార్బుల్స్‌తో సుందరీకరించింది. ట్రాన్స్‌కో చేపట్టిన పనుల్లో రెండు సబ్‌స్టేషన్లు ఉన్నాయి. పట్టణ, మండలాల్లో లోవోల్టేజ్ సమస్య పరిష్కారానికి అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశారు. శిథిలావస్థకు చేరిన ఆలయాలకు కొత్త రూపు వచ్చింది. పట్టణంలో మూడు స్నానాల రేవులు మాత్రమే ఉండేవి. స్నానాల రేవు సంఖ్య పెరిగింది. వలంధర్ రేవుకు ఆర్చి ఏర్పడింది. పురపాలకంలో తాగునీటి సమస్య లేకుండా 11 కిలో మీటర్ల మేర ఓహెచ్ఆర్‌లను కలుపుతూ పెద్ద పైప్‌లైన్ ఏర్పాటుచేశారు.

ప్రస్తుతం రెండు శాఖల ప్రతిపాదనలు

రానున్న పుష్కరాలకు ప్రతిపాదనలు చేయడంలో అధికార యంత్రాంగంలో కదలిక లేదు. పుష్కరాల్లో భక్తుల రద్దీ అధికంగా ఉంటుందని ప్రభుత్వం అంచనాకు వచ్చింది. దానికి తగట్టుగా పనులు చేపట్టాలని అన్ని శాఖల అధికారుల్ని అప్రమత్తం చేసినా ఆ దిశగా ప్రతిపాదనలు సిద్ధం కావడం లేదు. పురపాలక సంఘం మొద్దు నిద్రలో ఉంది. ఇంత వరకు ఏఏ పనులు చేయాలన్న దానిపై ఇంత వరకు ఇంజనీరింగ్ అధికారులకు ఒక స్పష్టత లేదు. పాత పనులనే తిరగేసే పనుల్లో ఉన్నారు. ఇక ఏటిగట్టుల శాఖ మాత్రం రూ 15 కోట్లు స్నానాల రేవుల ఆభివృద్ధి, ఏటిగట్టు పటిష్టం పనులకు ప్రతిపాదనలు ఇచ్చింది. ఇక ట్రాన్స్‌కో రూ 18 కోట్లకు సంబంధించి ప్రతిపాధనలు సిద్ధం చేసి ప్రభుత్వ అమోదానికి పంపింది.

ఈ పనుల పరిస్థితి ఏమిటి..?

గత పుష్కరాల్లో ట్రాఫిక్ జామ్‌తో భక్తులు ఇబ్బందులకు గురయ్యారు. ఈసారి 216 జాతీయ విస్తరణ వల్ల ఎక్కువ మంది భక్తులు వచ్చే అవకాశం ఉంది. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ప్రత్యామ్నయ మార్గాలను గుర్తించి రోడ్లను విస్తరించాల్సి ఉంది. వీటిల్లో పంచాయితీరాజ్, ఆర్అండ్‌బి సంయుక్తంగా ప్రతిపాదనలు చేపట్టాల్సి ఉంది. ఆలయాలకు సంబంధించి దేవదాయ శాఖ, తాగునీటి ఇబ్బందులు లేకుండా గ్రామీణ నీటి సరఫరా, ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా బస్సులు, సీసీ కెమెరాలు ఏర్పాటుపై ప్రతిపాదనలు ఇవ్వాల్సి ఉంది. ఇప్పటి వరకు రెండు శాఖలు మినహా మిగిలిన శాఖల్లో వేగం లేదు.ఇందులో కీలకంగా ఉండే పురపాలక శాఖ కూడా ఇంకా వెనకంజులో ఉంది. దీనిపై మునిసిపల్ డీఈ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామని వివరించారు.

సెలవు రోజుల్లో రిజిస్ట్రేషన్

స్లాట్ ఉంటే చేయాల్సిందే

ప్రభుత్వ మార్గదర్శకాలు

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

రిజిస్ట్రేషన్‌లపై రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. సెలవు రోజుల్లోనూ రిజిస్ట్రేషన్ నిర్వహించేలా మార్గదర్శకాలు జారీచేసింది. స్థలాలు, నివాసాలు, ప్లాట్‌లు ఏదైనా రిజిస్ట్రేషన్ చేసుకోడానికి ముందుగా స్లాట్ బుకింగ్ వెసులుబాటు కల్పించింది. ఆ సమయానికి రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళితే రిజిస్ట్రేషన్ అయిపోతుంది. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో వేచి ఉండాల్సిన అవసరం లేదు. రద్దీ ఉన్నా స్లాట్ ఉన్న వాళ్లకే అధికారులు ప్రాధాన్యం ఇస్తారు. సెలవు రోజుల్లో స్లాట్ బుక్ చేసుకున్నా రిజిస్ట్రేషన్ చేయాల్సిన బాధ్యత సబ్ రిజిస్ట్రార్‌పై ఉంటుంది. గతంలో ఇటువంటి నిబంధన ఉన్నా అమలుకు నోచుకోలేదు. ప్రజలకు రిజిస్ట్రేషన్ సేవలు మరింత చేరువ చేయాలన్న ఉద్దేశంతో కూటమి ప్రభుత్వం ఆన్‌లైన్ విధానాన్ని తెరపైకి తెచ్చింది. సెలవు దినాల్లో రిజిస్ట్రేషన్‌లకు అవకాశం ఇచ్చింది. ఉద్యోగ రీత్యా దూరప్రాంతాల్లో ఉన్న వారు, ఇతరులు సెలవు దినాల్లో రావడానికి అవకాశం ఉంటుంది. దీనిని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. స్లాట్ బుక్ చేసుకుంటే జవాబుదారీతనం ఉంటుందని ప్రభుత్వం ఆన్‌లైన్ బుకింగ్‌కు అవకాశం కల్పించింది.



ఇంటర్ పరీక్షలకు సర్వం సిద్ధం

- మార్చి 1 నుంచి పరీక్షలు ప్రారంభం
- ఈ నెల 20 న హాల్ టికెట్స్ జారీ
- 33,842 విద్యార్థులు
- 52 పరీక్షా కేంద్రాలు
- 900 మంది ఇన్విజిలేటర్లు..

భీమవరం రూరల్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ పరీక్షలు సమీపిస్తున్నాయి. అధికారులు పరీక్ష కేంద్రాలను సర్వం సిద్ధం చేస్తున్నారు. పరీక్షల నిర్వహణకు ఇన్విజిలేటర్స్, సిబ్బంది నియామకంపై అధికారులు సన్నాహాలు చేసేశారు. జిల్లాలో 52 పరీక్షా కేంద్రాలను ఏర్పాటుచేసి వాటన్నింటిలోను పరీక్షల నిఘా కొరకు సీసీ కెమెరాలను పెడుతున్నారు. ఈ కెమెరాల ద్వారా జిల్లా పరీక్షల నిర్వహణ కేంద్రం వద్ద పరీక్ష కేంద్రాల వీడియో రికార్డ్ అవుతుంది.

విద్యార్థుల సెల్‌ఫోన్‌కు హాల్‌టికెట్

ఇంటర్మీడియెట్ పరీక్షల హాల్ టికెట్స్ నేరుగా విద్యార్థుల సెల్‌ఫోన్‌లకు వెళ్లేలా ఇంటర్మీడియెట్ బోర్డు నిర్ణయించింది. ఈ నెల 20 నుంచి విద్యార్థుల సెల్‌ఫోన్‌లో వాట్సాప్ నుంచి హాల్ టిక్కెట్ పొందవచ్చు. విద్యార్థికి సెల్‌ఫోన్ లేకపోతే వారి తల్లిదండ్రుల ఫోన్‌లో వాట్సాప్ నుంచి హాల్ టికెట్ పొందవచ్చు. ఇప్పటికే హాల్‌టికెట్ జారీపై చర్యలు తీసుకున్నారు. గతంలో ఇంటర్ విద్యాసంస్థలు విద్యార్థులు ఫీజులు పెండింగ్‌లో ఉందనే నెపంతో హాల్‌టికెట్ ఇవ్వడంలో ఇబ్బందులు పెట్టేవారు. అలాంటివి జరగకుండా కొత్త విధానాన్ని బోర్డు తీసుకువచ్చింది.

జిల్లాలో 33,845 మంది విద్యార్థులు

జిల్లాలో 85 ప్రైవేట్ ఇంటర్మీడియెట్ కళాశాలలు, 15 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉన్నాయి. రెండు ఎయిడెడ్, 2 సోలషల్ వెల్ఫేర్, 26 హైస వన్ కళాశాలలు ఉన్నాయి. వీటి నుంచి ఈ ఏడాది ప్రథమ సంవత్సరం పరీక్షలకు 17,574 ద్వితీయ సంవత్సరం 16,271 మొత్తం 33,845 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు.

పరీక్ష కేంద్రాల్లో సౌకర్యాలు ఏర్పాటు

1 నుంచి ప్రారంభమయ్యే ఇంటర్మీడియెట్ పరీక్షలకు అన్ని సౌకర్యాలు కల్పించేలా చర్యలు తీసుకుంటున్నారు. 52 పరీక్ష కేంద్రాల్లో ఉండి మండలం యండగండి పరీక్ష కేంద్రం సమస్యాత్మక కేంద్రంగా గుర్తించారు. 450 మంది ఇంటర్ అధ్యాపకులతోపాటు మరో 450 మందిని ప్రభుత్వ పాఠశాలలోని సెకండ్ గ్రేడ్ టీచర్‌లు ఏర్పాటు చేస్తున్నారు. మొత్తం 900 మందిని పరీక్షలకు ఇన్విజిలేటర్లుగా నియమిస్తారు.

ఆర్టీసీ బస్సులకు ముందస్తుగా సమాచారం

ఇంటర్మీడియట్ పరీక్షలలో విద్యార్థులకు బస్ సౌకర్యం కల్పించేందుకు ఆర్టీసీకి ముందస్తు సమాచారం ఇచ్చారు. ప్రతి పరీక్షా కేంద్రానికి బస్ సౌకర్యం ఉండాలని సమయానికి విద్యార్థులను చేర్చేలా చూడాలని కలెక్టర్ సూచించారు. పరీక్ష కేంద్రాల వద్ద పరిశుభ్రత ఏర్పాట్లు మునిసిపాలిటీలకు అప్పగించారు. తాగునీరు, పరీక్ష గదులలో విద్యార్థి సౌకర్యార్థం హెల్త్ సౌకర్యం కల్పిస్తారు. పరీక్ష కేంద్రాల వద్ద టాయిలెట్స్ ఉండేలా చూడాలని ఆదేశాలు వెళ్లాయి.



సీసీ కెమెరాల నిఘా

19న ముగియనున్న ప్రాక్టికల్స్

ఇంటర్మీడియెట్ ప్రాక్టికల్స్ ఈ నెల 19న ముగుస్తున్నాయి. 10న మొదలైన ప్రాక్టికల్స్ పది రోజులపాటు జరుగుతున్నాయి. 73 సెంటర్లలో ప్రాక్టికల్స్ నిర్వహిస్తున్నారు. రెండు సెషన్లలో ప్రాక్టికల్స్ జరుగుతున్నాయి.

ఎమ్మెల్సీ పోలింగ్‌కు కసరత్తు

ఆరు జిల్లాల్లో 2 వేలకు పైగా ఎన్నికల విధుల్లో సిబ్బంది

ఈనెల 22న తుది విడత శిక్షణ



బ్యాలెట్ బాక్సుల వినియోగంపై శిక్షణలో పీవో, ఏపీవోలు(ఫైల్‌ఫొటో)

ఏలూరు,ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): తూర్పు-పశ్చిమ గోదావరి జిల్లాల్లో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు పోలింగ్ గడువు పది రోజులు లోపే ఉండటంతో ఎన్నికల నిర్వహణకు యంత్రాంగం కసరత్తు చేస్తోంది. ఇప్పటికే ఒక విడత శిక్షణ పూర్తి కాగా 22న మరోసారి పీవో, ఏపీవోలు, ఇతర సిబ్బందికి శిక్షణ పూర్తి చేయనున్నారు. మోడల్ కోడ్ అమల్లోకి వచ్చిన వెంటనే ఎన్నికల నిర్వహణకు జిల్లా అధికారులను నోడల్ అధికారులుగా నియమిస్తూ జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఉత్తర్వులను జారీ చేసిన విషయం తెలిసిందే. ఈనెల 27 ఉదయం 8 గంటల నుంచి 4 గంటలకు వరకు పోలింగ్ జరుగనున్నది. దాదాపుగా 2 వేల పైబడి అధికారులు, సిబ్బంది ఎన్నికల విధులు నిర్వహించనున్నారు. 456 పోలింగ్ కేంద్రాల్లో ఒక పీవోతో పాటు, ఏపీవో మరో ఇద్దరు సపోర్టింగ్ స్టాఫ్ విధుల్లో ఉండనున్నారు. ఆరు జిల్లాల్లో కలిపి మొత్తం 456 మంది ప్రిసైడింగ్ ఆఫీసర్లు, 456 మంది అసిస్టెంట్ ప్రిసైడింగ్ ఆఫీసర్లు, 456 మంది మైక్రో అబ్జర్వర్లు, 456 మంది వెబ్ కాస్టింగ్ చేయనున్నారు. పోలింగ్ సరళిని వెబ్‌కాస్టింగ్‌తో నిఘా పెట్టనున్నారు. పోలింగ్ ముగిశాక పూర్తిస్థాయిలో కౌంటింగ్ ప్రక్రియపై యంత్రాంగం దృష్టి సారించనుంది. 456 పోలింగ్ కేంద్రాలకు ఈ సిబ్బందితో పాటు అదనంగా 20 శాతం రిజర్వ్‌లో అధికారులు, సిబ్బంది కూడా ఎన్నికల విధులకు సిద్ధం అయ్యారు. ప్రతీ జిల్లాలో పోలింగ్ సరళిని పర్యవేక్షించేందుకు 10 మంది జోనల్ ఆఫీసర్లు చొప్పున మండల స్థాయి లేదా, డిప్యూటీ తహసీల్దార్ క్యాడర్‌లోని అధికారులు పనిచేస్తారు.

26న పోలింగ్ సామాగ్రి తరలింపు

జిల్లా కేంద్రాల్లో 26న ఉదయం పోలింగ్ మెటీరియల్‌తో ఎన్నికల సిబ్బంది రూట్ ఆఫీసర్ల పర్యవేక్షణలో బస్సుల్లో బ్యాలెట్ బాక్సులు, ఇతర సామాగ్రితో తరలివెళ్లనున్నారు. ఆయా జిల్లాల్లోని డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల్లో 25వ తేదీ రాత్రికే ఏర్పాట్లను ఆయా జిల్లా కలెక్టర్లు పూర్తి చేస్తారు. 27న తర్వాత పోలింగ్ పూర్తయ్యాక ఏలూరు సీఆర్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్‌రూమ్‌లో బ్యాలెట్ బాక్సులు భద్ర పరచనున్నారు. ఈ ప్రక్రియ అంతా పోలీస్ యంత్రాంగం ద్వారానే జరగనుంది.

ప్రకటనలకు ఎంసీఎంసీ ఆమోదం తప్పనిసరి

ఎమ్మెల్సీ ఎన్నికలకు ఎలక్ట్రానిక్ మీడియాలో రాజకీయ ప్రకటలనకు తప్పనిసరిగా మీడియా సర్టిఫికేషన్ మోనటరింగ్ కమిటీ (ఎంసీఎంసీ) నుంచి ముందస్తు ఆమోదం పొందాల్సి ఉంటుందని ఎన్నికల రిటర్నింగ్ అధికారి కె.వెట్రిసెల్వి ఒక ప్రకటనలతో తెలిపారు. ప్రకటనలు ప్రసారం చేయదలచిన తేదీకీ కనీసం మూడు రోజుల ముందు సంబంధిత అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ప్రవర్తనా నియామళిని పాటించాలి

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రవర్తనా నియామవళి ప్రకారం 25వ తేదీ సాయంత్రం 4 గంటకల్లా ప్రచారానికి తెరపడనుంది. ఓట్లను అభ్యర్థించేటప్పుడు కుల,మతపరమైన భావాలు వ్యక్తం చేయరాదు. మసీదులు, చర్చిలు, దేవాలయాలు, ఇతర ఆరాధన ప్రదేశాలను వేదికగా ఉపయోగించకూడదు. పోలింగ్ స్టేషన్‌కు 100 మీటర్ల పరిధిలో ప్రచారం చేయడం, పోలింగ్ పూర్తి కావడానికి 48 గంటల కాలంలో మీటింగ్‌లు నిర్వహించడం వంటివి చేయరాదు. సభ నిర్వహణపై ముందుగా పోలీసులకు సమాచారం ఇవ్వాలి.





హాకీ పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

హోరాహోరీగా ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నమెంట్

కాకినాడ, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో జరుగుతున్న ఆల్‌ఇండియా సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నమెంట్ రెండోరోజు ఆదివారం టోర్నమెంట్ హోరాహోరీగా సాగింది. తొలుత ఆర్ఎస్బీ హైదరాబాద్, ఆర్ఎస్బీ కొచ్చి జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ఆర్ఎస్బీ హైదరాబాద్ 8-1తేడాతో విజయం సాధించింది. ఆర్ఎస్బీ చండీగర్, ఆర్ఎస్బీ ముంబై జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ఆర్ఎస్బీ ముంబై 5-1 తేడాతో విజయం సాధించింది. అలాగే ఆర్ఎస్బీ సిమ్లా, ఆర్ఎస్బీ రాయ్‌పూర్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ఆర్ఎస్బీ రాయ్ పూర్ జట్టు 6-2తేడాతో విజయం సాధించింది. చత్తీస్‌గడ్, గుజరాత్ సెక్రటేరియట్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో చత్తీస్‌గడ్ జట్టు 13-0 తేడాతో గుజరాత్ జట్టుపై విజయం సాధించింది.మధ్యప్రదేశ్, తెలంగాణ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో తెలంగాణ జట్టు 4-3 తేడాతో విజయం సాధించింది. కేరళ, ఢిల్లీ సెక్రటేరియట్ మధ్య జరిగిన మ్యాచ్‌లో ఢిల్లీ జట్టు 9-0 తేడాతో కేరళ జట్టుపై విజయం సాధించింది. పాండిచ్చేరి, ఒడిశా సెక్రటేరియట్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ఒడిసా జట్టు 6-0 తేడాతో విజయం సాధించింది. గోవా, మహారాష్ట్ర జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో మహారాష్ట్ర సెక్రటేరియట్ జట్టు 18-0 తేడాతో గోవాపై విజయం సాధించింది. డీఎస్‌డీవో శ్రీనివాసకుమార్, హాకీ కోచ్ రవిరాజు పాల్గొన్నారు.

ఆర్చరీలో హంసినికి బంగారు పతకం



భీమవరం టౌన్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : ఎన్‌టిపీసీ జూనియర్ నేషనల్ ఆర్చరీ ఛాంపియన్ షిప్ పోటీల్లో విలువిద్య బాలికల వ్యక్తిగత విభాగంలో భారతీ విద్యాభవన్స్‌లో ప్లస్-2 చదువుతున్న మాదాల సూర్య హంసిని బంగారు పతకం సాధించింది. ఢిల్లీకి చెందిన కుమిత్ సనానిపై 143/141 స్కోర్‌తో బంగారు పతకం సాధించింది. హంసినిని ఏపీ స్టేట్ ఆర్చరీ అసోసియేషన్ సెక్రటరీ చెరుకూరి సత్యనారాయణ, జిల్లా సెక్రటరీ జయరాజు, కోచ్ కమల్ కిషోర్ అభినందించారు.

ముక్కలేనిదే ఆదివారం చాలామందికి ముద్ద దిగదు.. అందుకే ఆదివారం వచ్చిందంటే మాంసం దుకాణాలు కళకళలాడు తుంటాయి.. అయితే బర్డ్‌ఫ్లూ భయం కారణంగా కొన్ని రోజులుగా చికెన్ తినడం మానేశారు.. చికెన్ అమ్మకాలు కుదేలయ్యాయి.. షాపులు వెలవెలబోతున్నాయి. మాంసప్రియులు మటన్, చేపలు కొనేందుకు ఆసక్తి చూపడంతో వాటికి డిమాండ్ పెరిగిపోయింది.. చేపల మార్కెట్‌లు కిటకిటలాడాయి.. చికెన్ దుకాణాల్లో మటన్ అమ్మకాలు చేపట్టారు.. ఇదే అదనుగా వ్యాపారులు వాటి ధరలు కూడా పెంచేశారు.. చాలా ప్రాంతాల్లో ఇదే పరిస్థితి..

చికెన్‌కు చిక్కులు



ద్వారకాతిరుమలలో ఖాళీగా చికెన్ దుకాణం

వెంటాడుతున్న బర్డ్‌ఫ్లూ భయాలు

ఆదివారం వెలవెలబోయిన దుకాణాలు

జోరుగా మటన్, చేపలు,రొయ్యల అమ్మకాలు

అమాంతం పెరిగిన డిమాండ్

ఎక్కడికక్కడ ధరలు పెంచేసిన వ్యాపారులు



రద్దీగా తాడేపల్లిగూడెం చేపల మార్కెట్

తాడేపల్లిగూడెం రూరల్/ తాడేపల్లిగూడెం అర్బన్/ ద్వారకా తిరుమల/గణపవరం/ఏలూరు రూరల్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): బర్డ్‌ఫ్లూ దెబ్బకు జిల్లాలో చికెన్ విక్రయాలు తుడిచిపెట్టుకు పోయాయి. పది రోజులుగా బర్డ్‌ఫ్లూ భయంతో ప్రజలు చికెన్ కొనడం, తినడం మానేయడంతో ఈ ఆదివారం వ్యాపారులే విక్రయాలు నిలుపుదల చేశారు. కొన్ని చోట్ల చికెన్ షాపుల్లో చేపలు విక్రయించారు.మటన్, చేపలకు డిమాండ్ పెరిగింది. చికెన్ విక్రయాలు సాధారణంగా ఆదివారం ప్రత్యేకించి పశ్చిమ ఉమ్మడి పశ్చిమలో పది టన్నుల వరకూ విక్రయాలు జరిగేవి. కానీ ఈ ఆదివారం విక్రయాలు టన్ను కూడా అమ్మలేకపోయారు. తాడేపల్లిగూడెం, తణుకు, భీమవరం, ఉంగుటూరు, ద్వారకాతిరుమల, గణపవరం తదితర ప్రాంతాల్లో చికెన్ షాపులే తెరవలేదు.

మటన్, చేపలు, రొయ్యల ధరలకు రెక్కలు

గతంలో కేజీ మటన్ రూ.800లకు విక్రయించగా తాజాగా వెయ్యి నుంచి రూ.1200 వరకూ విక్రయాలు చేశారు. చేపలు కేజీ రూ.130 ఉండేవి రూ.180కి పెంచారు. కేజీ రొయ్యలు రూ.250 నుంచి రూ.350కి అమ్మారు. ఈ ఆదివారం మటన్ విక్రయాలు గతంలో కంటే రెండు రెట్లు సాగించినట్టు వ్యాపారులు చెబుతున్నారు. చేపలు, రొయ్యల విక్రయాలు సాధారణం కంటే మరికాస్త పెరిగాయి. తాడేపల్లిగూడెంలో కేజీ మటన్ రూ.800 , బోన్‌లెస్ అయితే రూ. 900 ఉండగా ప్రస్తుతం కేజీ రూ.1000 చేసి అమ్మకాలు జరిపారు. బోన్‌లెస్ మటన్ అయితే రూ.1200 అమ్మారు. చేపలు సైజుని బట్టి కిలో రేట్లను పెట్టారు. మామూలు రకం చేప అయితే గత వారం రూ 150 ఉండగా ప్రస్తుత మార్కెట్‌లో రూ.180 వరుకూ అమ్మకాలు సాగించారు. పెద్ద సైజు చేపలు అయితే కేజీ రూ 200 వరుకూ అమ్మకాలు సాగించారు. రొయ్యల ధర గత వారం లో రూ.170 ఉండగా ప్రస్తుతం రూ.270 వరుకూ విక్రయాలు సాగించారు. రొయ్య సైజు పెద్దది అయితే రూ 300 లకు పైగా అమ్మకాలు జరిపారు. పీతలు కూడా ఇదే పరిస్థితి . మీడియం సైజు పీతలు కిలోకు సుమారు 7 పీతలు వస్తాయి . వీటి ధర గత వారం రూ.350 నుంచి రూ.400 ఉండగా ప్రస్తుతం రూ.750 వరుకూ అమ్మకాలు సాగించారు. చిన్న సైజు పీతలయితే గత వారం రూ 250 ఉండగా ఈ వారం రూ.450 వరుకూ విక్రయాలు జరిపారు. ద్వారకాతిరుమలలో చికెన్‌సెంటర్లు ఆదివారం వెలవెల పోయాయి. ప్రత్యామ్నాయంగా స్థానికులు చేపలు, మటన్ కొను గోలుకు ఆసక్తి చూపారు. ఇక్కడ గత వారం కేజీ చేప ధర రూ.130 ఉంటే ప్రస్తుతం రూ.180కు అమ్మారు. గణపవరం మార్కెట్‌లో చేపలు కొనేందుకు వినియోగదారులు క్యూకట్టారు. చేపలు రిటైల్ రూ.150 కిలో ఉండగా ప్రస్తుతం కిలో రూ.170 వసూలు చేస్తున్నారు. ఆదివారం మాంసం ప్రియులతో ఏలూరు చేపల మార్కెట్ రద్దీగా మారింది. రోజువారి కన్నా మటన్ భారీగా కొనుగోళ్లు చేశారు. సాధారణంగా కిలో రూ.700 నుంచి రూ.800 ఉండే మటన్ ప్రస్తుతం రూ.వెయ్యికి పెంచేశారు. చేపలు కిలో రూ.140 నుంచి రూ.150 సాధారణ రోజుల్లో అమ్మేవారు. ప్రస్తుతం రూ.180 అమ్ముతున్నారు.



బాదంపూడిలో డ్రోన్ ద్వారా సోడియం హైపో క్లోరైడ్ ద్రావణాన్ని పిచికారీ చేసేందుకు సిద్ధం చేసిన దృశ్యం

రెడ్‌జోన్‌లో సోడియం హైపోక్లోరైడ్ పిచికారీ

ఉంగుటూరు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) :ఏలూరు జిల్లాలోని బర్డ్‌ఫ్లూ నిర్ధారణ అయిన ప్రాంతంలో ఆదివారం (రెడ్ జోన్)లో డ్రోన్ సాయంతో సోడియం హైపోక్లోరైడ్ ద్రావణాన్ని పిచికారీ చేశారు. రెడ్‌జోన్ ప్రాంతంలో ఎటువంటి అంటువ్యాధులు ప్రబలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్టు బాదంపూడి పంచాయతీ కార్యదర్శి కాకర్ల గిరిధర్ తెలిపారు. డ్రోన్ ద్వారా పిచికారీని సర్పంచ్ కంకట పద్మలీల,కూటమి నాయకులు జామి రాంబాబు, వెలమాటి కాశీ కృష్ణ, ఏఎన్ఎంలు పర్యవేక్షించారు.



కొట్టుకువచ్చిన కోళ్లను ఖననం చేసిన పంచాయతీ సిబ్బంది

రేలంగి గోస్తనీలో కొట్టుకు వచ్చిన కోళ్లు

ఇరగవరం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : వైరస్ బారిన పడిన కోళ్ల మృత్యువాత పడుతున్న నేపథ్యంలో ఆదివారం ఇరగవరం మండలం రేలంగి గోస్తనీ నదిలో చనిపోయిన కోళ్ళు కొట్టుకు రావడం స్థానికులను భయాందోళనకు గురి చేసింది. దీంతో స్థానికులు పంచాయతీ అధికారులకు సమాచారం అందించడంతో వెంటనే అప్రమత్తమయ్యారు. స్థానిక పశు సంవర్థకశాఖ సిబ్బంది సూచనలతో సుమారు 500 కోళ్లను గ్రామ శివారులో శాస్త్రీయ పద్ధతిలో ఖననం చేసినట్లు గ్రామ కార్యదర్శి లక్ష్మీనారాయణ తెలిపారు. భయపడాల్సిన అవసరం లేదని పశుసంవర్ధక శాఖ సిబ్బంది తెలిపారు.



విగ్రహాలను ట్రాక్టర్‌లో ఊరేగిస్తున్న దృశ్యం

కలవపూడిలో ఘనంగా ఉమా భీమేశ్వర స్వామి ఆలయ ప్రతిష్ఠ ఉత్సవాలు

కాళ్ళ, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : హరోం..హర అంటూ కలవపూడి గ్రామం ఆదివారం శివనామస్మరణతో మారుమోగింది. కాళ్ళ మండలం కలవపూడిలో ఉమాభీమేశ్వరస్వామి ఆలయం శిథిలావస్థకు చేరడంతో నూతన ఆలయ నిర్మాణానికి గ్రామస్తులు పూనుకున్నారు. రెండు వారాలుగా ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక హోమాలు, పూజలు నిర్వహిస్తున్నారు. ఎంతో సుందరంగా నూతనంగా నిర్మించిన ఆలయంలో ఈనెల 21వ తేదీన ప్రతిష్ఠించబోయే రాతి విగ్రహాలను అత్యంత భక్తిశ్రద్ధలతో గ్రామంలోని పురవీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు.యాగశాలలో జలాధివాసం, ధాన్యాధివాసం వంటి పూజలు నిర్వహించారు. 21వ తేదీ శుక్రవారం ఉదయం 10.30 గంటలకు నూతన ఆలయంలో స్వామి అమ్మవార్ల విగ్రహ ప్రతిష్ఠ, కుంభాభిషేక మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.



పూజల్లో పాల్గొన్న భక్తులు

ఆమె రచనలు స్ఫూర్తిదాయకం : మాజీ ఎంపీ గంగరాజు

ఏలూరులో వేడుకగా ఓల్గాకు కృష్ణమూర్తి సాహిత్య పురస్కారం



ఓల్గాకు పురస్కారం అందిస్తున్న ఫౌండర్ మడుపల్లి మోహన గుప్తా, మాజీ ఎంపీ గోకరాజు గంగరాజు తదితరులు

ఏలూరు రూరల్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): సాహితీవేత్తల రచనలు నదీ ప్రవాహాలు అని పోపూరి లలితకుమారి రచనలు ఎంతోమందికి స్ఫూర్తినిస్తూ ప్రభావం చేస్తున్నాయని నరసాపురం మాజీ ఎంపీ, వీహెచ్‌పీ జాతీయ ఉపాధ్యక్షుడు గోకరాజు గంగరాజు అన్నారు. గుప్తా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతి ఏడాది అందించే కృష్ణమూర్తి సాహిత్య పురస్కార మహోత్సవం ఆదివారం సాయంత్రం ఏలూరు వైఎంహెచ్‌ఏ హాల్లో వేడుకగా జరిగింది. తెలుగు రచయిత్రి లలితకుమారి (ఓల్గా)కు 2024 సంవత్సరానికి గాను ఈ పురస్కారం అందజేశారు. జ్ఞాపిక, రూ.3 లక్షలు నగదు అందించారు. గుప్తా ఫౌండేషన్ ఫౌండర్ మడుపల్లి మోహన్ గుప్తా మాట్లాడుతూ సామాజిక, కళా సాంస్కృతిక, సాహిత్యార్చనలో తమ వంతు కృషి చేస్తున్నామన్నారు. గుప్తా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏలూరు వెంకన్నచెరువు స్మశాన వాటిక పునరుద్ధరణకు కోటి రూపాయలు అందజేశారు. శివ గోపాల్ లునాని, వాల్మీకి విజ్ఞాన కేంద్రం, పాఠశాల భోజన సహాయం కోసం రూ.46 లక్షలు ఫిక్స్‌డ్ డిపాజిట్, వంగాయిగూడెం గుడ్ సమరటిన్ క్యాన్సర్ ఆసుపత్రికి రూ.2 లక్షలను విరాళంగా అందజేశారు. ప్రొఫెసర్ చుండూరి మృణాలిని, చార్టెడ్ అకౌంటెంట్ సుబ్బారావు, గుప్తా ఫౌండేషన్ సిబ్బంది, నగర ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన నృత ప్రదర్శనలు ఆహూతులను ఆకట్టుకున్నాయి.





ఆకట్టుకున్న నృత్య ప్రదర్శనలు



వివరాలు చెప్తున్న డీఎస్పీ శ్రావణ్‌కుమార్

ఇద్దరు దొంగలు అరెస్టు

నాలుగు మోటారు సైకిళ్లు స్వాధీనం

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : వారిద్దరూ పాత నేరస్తులు... ప్రాంతాలు మారి, నివాసాలు మార్చి మోటారు సైకిళ్ళను తస్కరించి వాటితో చైన్ స్నాచింగ్ నేరానికి పాల్పడ్డారు. మొత్తం మీద పోలీసులు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టి వారిద్దని అరెస్టు చేశారు. నిందితుల నుంచి నాలుగు మోటారు సైకిళ్లు స్వాధీనం చేసుకుని చైన్ స్నాచింగ్‌కు పాల్పడిన బంగారం ముత్తూట్ ఫైనాన్స్‌లో ఉన్నట్లు గుర్తించారు. కేసుల వివరాలను ఏలూరు డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్ ఆదివారం వెల్లడించారు. చింతలపూడి మండలం బోయిగూడెం గ్రామానికి చెందిన అక్కల రామచంద్రరావు భీమడోలు మండలం సూరప్ప గూడెం గ్రామంలోని వెజ్జు బాలాజీకి చెందిన పొలాన్ని కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నాడు. జనవరి 28వ తేదీన ఆ పొలంలో ఉన్న షెడ్డులో తన పల్సర్ మోటారు సైకిల్ పెట్టి తాళం వేసి స్వగ్రామానికి వెళ్లి ఈనెల 13వ తేదీన తిరిగి వచ్చి చూసేటప్పటికి షెడ్డు తాళాలు పగులగొట్టి ఉన్నాయి. మోటారు సైకిల్ అపహరించుకుపోయారు భీమడోలు పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్పీ కిషోర్ ఆదేశాల మేరకు డీఎస్పీ శ్రావణ్‌కుమార్ పర్యవేక్షణలో భీమడోలు సీఐ విల్సన్, భీమడోలు ఎస్ఐ సుధాకర్, సిబ్బంది దర్యాప్తు చేపట్టారు. ఈ నేరానికి పాల్పడిన ఏలూరు వంగాయి గూడేనికి చెందిన వాసిరాజు అలియాస్ సాంబశివరావు (40) ప్రస్తుతం ఇతను భీమడోలు మండల సూరప్ప గూడెంలో ఉంటున్నాడు. ఇతడిని అతని ఇంటి వద్దే అరెస్టు చేసి పల్సర్ మోటారు సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. అతనితో పాటే ఉన్న భీమడోలులోని గొలుసులగేటు రోడ్డులో నివాసం ఉంటున్న యర్రంశెట్టి పవన్‌కుమార్ అలియాస్ పాయాగాడు (25)ను కూడా అదుపులోకి తీసుకున్నారు. వీరిద్దరు కలిసి ఈనెల 6వ తేదీన డిస్కవర్ మోటారు సైకిల్‌పై ఏలూరు వెళ్లి అక్కడ వన్‌టౌన్ పడమర వీధి పిలగల వీరమ్మ అనే వృద్ధురాలి మెడలో బంగారపు గొలుసు తెంపుకుని పారిపోయారు. వీరిని పూర్తిస్థాయిలో విచారించారు. ప్రధాన నిందితుడైన వాసిరాజుపై వివిధ పోలీస్ స్టేషన్లలో 14 దొంగతనం కేసులు ఉన్నాయని అతనిపై భీమడోలు పోలీస్ స్టేషన్‌లో సస్పెక్ట్ షీటు ఉందన్నారు. వీరిద్దరు కలిసి ద్వారకాతిరుమల పరిధిలో ఒక మోటారు సైకిల్, భీమడోలు పరిధిలో మూడు మోటారు సైకిళ్లను అపహరించారు. వారి నుంచి మొత్తం నాలుగు మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. చైన్ స్నాచింగ్‌లో అపహరించిన గొలుసును ముత్తూట్ ఫైనాన్స్‌లో రెండు లక్షల 40 వేల రూపాయలకు తాకట్టు పెట్టినట్లుగా గుర్తించారు. దొంగల నుంచి స్వాధీనం చేసుకున్న నాలుగు మోటారు సైకిళ్ల విలువల రెండు లక్షల 25 వేల రూపాయలు ఉంటాయని డీఎస్పీ తెలిపారు. భీమడోలు హెడ్ కానిస్టేబుల్స్ శ్రీనివాసరావు, బాజీ, ద్వారకాతిరుమల కానిస్టేబుల్ వెంకటేశ్వరరావులను డీఎస్పీ అభినందించారు.

లారీపై టార్పాలిన్ కట్లు విప్పుతూ కుప్పకూలి డ్రైవర్ మృతి



పెదవేగి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : లారీపై కప్పి ఉంచిన టార్పాలిన్‌కు ఉన్న కట్లు విప్పుతూ డ్రైవర్ మృతి చెందినట్టు పెదవేగి ఎస్ఐ కె.రామకృష్ణ తెలిపారు. కాకినాడ జిల్లా ఇంద్రపాలెంకు చెందిన పిల్లి నూకరాజు హైదరాబాద్ నుంచి పెదవేగి మండలం వంగూరులోని గౌతమీ ఆగ్రో ఇండస్ట్రీకి ఖాళీ బ్రాందీ సీసాల లోడు లారీతో ఆదివారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో వచ్చాడు. ఖాళీ సీసాలను దించ డానికి లారీపై కప్పి ఉంచిన టార్పాలిన్‌ను తొలగిస్తూ ఒక్కసారిగా లారీపై

క్రైమ్ కార్నర్

కుప్పకూలిపోయాడు. అక్కడి పనిచేసే సిబ్బంది గమనించి 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. 108 సిబ్బంది వచ్చి పరిశీ లించగా అప్పటికే నూకరాజు (55) మృతి చెందాడని చెప్పారు. నూకరాజు మృతిపై అతని బంధువులకు సమాచారం అందించామని వారు వచ్చిన తరువాత పంచనామా నిర్వహించి, శవ పరీక్షకు తరలిస్తామని ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.

మహిళ మెడలో గొలుసు చోరీ

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : ఆసుపత్రికి తన తల్లిని తీసుకువెళ్ళి చూపించి తిరిగి మోటారు సైకిల్‌పై వెళ్తుండగా ఆకస్మాత్తుగా ఇద్దరు వ్యక్తులు మోటారు సైకిల్‌పై పక్కగా వచ్చి తల్లి మెడలోని బంగారపు గొలుసును తెంపుకుని అతివేగంగా వెళ్ళిపోయారు. ఈ సంఘటనపై ఏలూరు టూటౌన్ పోలీసులు ఆదివారం ఉదయం కేసు నమోదు చేశారు. ఏలూరు రూరల్ మండలం పాలగూడెం గ్రామానికి చెందిన రుంజల వెంకటేష్ తన తల్లి నిర్మల (62)ను ఏలూరులోని ఒక ప్రైవేటు ఆసుపత్రికి ఈనెల 15వ తేదీ రాత్రి తీసుకువచ్చి 10 గంటల ప్రాంతంలో మోటారు సైకిల్‌పై ఇంటికి వెళ్తుండగా ఏలూరు గూడ్స్‌షెడ్డు రోడ్డులో పెద్ద రైల్వే స్టేషన్ సమీపంలో వెనుక నుంచి ఇద్దరు యువకులు యునికార్న్ మోటారు సైకిల్‌పై వచ్చి ఆకస్మాత్తుగా నిర్మల మెడలోని మూడు కాసుల బంగారపు గొలుసును తెంపుకుని అతి వేగంగా వెళ్ళిపోయారు. బాధితులు ఆదివారం ఉదయం ఏలూరు టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పాముకాటుకు వృద్ధురాలి మృతి

నరసాపురం రూరల్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎల్‌బీ చర్ల గ్రామానికి చెందిన వర్ధనపు పుష్ప (55) పాటు కాటుకు గురై మృతి చెందింది. ఇంట్లో వంట చేసుకునే సమయంలో పాము ఇంట్లోకి చేరి ఆమెను కాటు వేసింది. వెంటనే ఆమెను నరసాపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి వైద్యం చేస్తుండగా మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు చెప్పారు.

బావాయిపాలెంలో యువకుడి దారుణ హత్య

చేయి నరికి తీసుకువెళ్లిన దుండగులు



ఏసు వివాహం ఫొటో



మృతదేహాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ శ్రావణ్ కుమార్ సీఐ సుభాష్ →

నిడమర్రు ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి):ప్రేమించి పెళ్లిచేసుకొన్న భర్తను విగతజీవిగా చూసి ఆ భార్య పెడుతున్న కన్నీరును ఆపడం ఎవరితరం కాలేదు. ఏడుడుగులతో మొదలైన బంధం రెండేళ్లు కూడా సాగకుండానే కొండెక్కిపోయింది.బతుకుదెరువు కోసం రొయ్య చెరువుపై పనికిపోయిన తన మనవడు తెల్లారేసరికి శవంగా తిరిగిరావడం చూసి ఆ అమ్మమ్మ ఏడ్చి ఏడ్చి సొమ్మసిల్లింది. నిడమర్రు మండలం బావాయిపాలెం గ్రామ శివారు ప్రాంతం చినకాపవరం పంటకాల్వ వద్ద దుండగులు ఒకరిని హత్యచేసి పరాయయ్యారు. బావాయిపాలెం గ్రామానికి చెందిన మజ్జి ఏసును (26) శనివారం అర్ధరాత్రి దాటాక దుండగులు అత్యంత కిరాతకంగా హత్య చేశారు. మృతుని చెయ్యి పట్టుకొని పోయారు. ఏసు భార్య శ్రీవల్లి 8 నెలల గర్భిణి. పురుడు కోసం పుట్టింటికి వెళ్లింది. ఏసు తండ్రి ప్రసాద్ చాన్నాళ్ల క్రితం చనిపోగా తల్లి దుబాయ్‌లో పనిచేస్తున్నది. అమ్మమ్మతో పాటు ఏసు దంపతులు కలసి జీవిస్తున్నారు. హత్యకు గురైన ఏసు శెట్టిబలిజ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి..అదే సామాజిక వర్గానికి చెందిన శ్రీవల్లిని ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. ఈ హత్యకు కారణాలు తెలియలేదు. పాతకక్షలా లేక వేరే కారణాలు ఏమైనా ఉన్నాయా అనే కోణంలో పోలీసులు విచారణ సాగిస్తున్నారు. ఒకరు కన్నా ఎక్కువ మంది ఇందులో ఉన్నట్లు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. సమాచారం అందిన వెంటనే నిడమర్రు సర్కిల్ ఇన్స్‌పెక్టర్ ఎం.వీ సుభాష్, ఎస్.ఐ వీరప్రసాద్‌లు సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. ఏలూరు నుంచి క్లూస్ టీంను రప్పించి ఆధారాలు సేకరిస్తున్నారు. పోలీస్ డాగ్ మృతుడు ఇంటి పరిస రాలలో సంచరించింది. ఏలూరు డీఎస్పీ శ్రావణ్ కుమార్ క్లూస్‌టీమ్ తోన్నూ, సీఐ ఎస్ఐలతో విచారించారు. సీఐ మాట్లాడుతూ అనుమానాస్పద వ్యక్తులను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు తెలిపారు.



ఏసు నివాసం ఉంటున్న ఇల్లు

పంట కాల్వలో గుర్తు తెలియని మృతదేహం

కైకలూరు, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి) : పంటకాల్వలో గుర్తు తెలియని మృతదేహం లభ్యమైనట్లు కైకలూరు టౌన్ సీఐ కృష్ణ తెలి పారు. ఆదివారం శ్యామలాంబపురంలో పోల్ రాజ్ కాల్వలో సుమారు 35 నుంచి 40 ఏళ్ల వయసు ఉన్న వ్యక్తి మృతదేహాన్ని గుర్తించి నట్లు తెలిపారు. వీఆర్ఏ ఫిర్యాదు మేరకు పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమా ర్టం కోసం కైకలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సమాచారం తెలిస్తే కైకలూరు పోలీసుల సెల్ నంబర్లు 94407 96434, 94407 96433లకు సమాచారం అందించాలని కోరారు.

కొమరవరం పాఠశాల మూయవద్దు

తణుకు రూరల్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం చేపట్టిన పాఠశాలల విలీన ప్రక్రియ నుంచి తమ పాఠశాలకు మినహాయించాలంటూ కొమరవరం గ్రామానికి చెందిన ఎస్సీ వర్గీయులు కోరుతున్నారు. ఈ మేరకు ఎంఈవోకు వినతి పత్రాన్ని అందజేసినట్టు తెలిపారు. కొమరవరం ఎస్సీ ఏరియాలోని ప్రాథమిక పాఠశాలను 1940లో స్థాపించారని, అప్పటి నుంచి ఎంతో మంది దళితులు ఈ పాఠశాలలో చదివి వృత్తి, ఉద్యోగాల్లో స్థిరపడ్డారని అలాంటి పాఠశాలను విలీనం పేరుతో మూసేయడం బాధాకరమని వీలైతే దానిని మరింత అభివృద్ధి చేయాలని మూసేయవద్దని అధికారులను వేడుకున్నారు.

పాకల తొలగింపుతో ఉద్రిక్తత

ఎమ్మెల్యే హామీతో సమసిన వివాదం

భీమవరం అర్బన్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): భీమవరంలో పేదల గుడిసెలు తొలగించడాన్ని సీపీఎం నాయకులు అడ్డుకున్నారు. ఆదివారం స్థానిక కోర్టు పక్కన ఉన్న పేదల గుడిసెలు తొలగించేందుకు మునిసిపల్ అధికారులు, పోలీసుల సహకారంతో యత్నించడాన్ని సీపీఎం వ్యతిరేకించింది. సీపీఎం నాయకులు బి.వాసుదేవరావు, డి.త్రిమూర్తులు, ఎం.ఆంజనేయులు సంఘటనా స్థలానికి వెళ్ళి అధికారులను నిలదీశారు. ప్రత్యామ్నాయం చూపే వరకు కదలరని భీష్మించడంతో స్థానిక ఎమ్మెల్యే పేదలకు టిడ్కో ఇళ్ళను కేటాయిస్తామని, రెండు, మూడు రోజుల్లో సమస్య పరిష్కరిస్తామని చెప్పడంతో ఆందోళన విరమించారు.

గుడ్డ సంచుల పంపిణీ

భీమవరం టౌన్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): మన ఆరోగ్యం కోసం ప్లాస్టిక్‌ను నిషేధించాలని ప్రభుత్వం చేస్తున్న కృషికి ప్రజలంతా సహకరించాలని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు యేలేటి న్యూటన్ అన్నారు. మునిసిపాల్టీ, శ్రీ విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఆదివారం సంత మార్కెట్‌లో ప్రజలకు ఉచితంగా గుడ్డ సంచులను పంపిణీ చేశారు. గ్రంధి వెంకటేశ్వరరావు సంత మార్కెట్ లో 200 మందికి వబిలిశెట్టి రామకృష్ణ, కంతేటి వెంకటరాజు సహకారంతో గుడ్డ సంచులను అందించారు. నిర్వాహకులు రంగసాయి, మునిసిపల్ అసిస్టెంట్ కమిషనర్ వెంకటేశ్వరరావు, రామాయణం సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కేర్ సెంటర్ ఏర్పాటుపై హర్షం

భీమవరంటౌన్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : తలసీమియా బాధితుల కోసం అమరావతిలో తలసీమియా కేర్ సెంటర్ నిర్మిస్తామని హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ ప్రకటించడం హర్షణీయమని ఒమిక్స్ లేబొరేటరీ వైద్యుడు పులగం మధుబాబు, సంఘ సేవకుడు చెరుకువాడ రంగసాయి అన్నారు. ఎన్టీఆర్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి తలసీమి యా బాధితుల కష్టాలు చూసి తలసీమియా కేర్ సెంటర్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించారని, దీనికి స్పందించి డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ రూ. 50 లక్షలు అందించడం హర్షణీయమన్నారు. తలసీమియా బాధితుల కోసం అందరూ రక్తదానం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఒమిక్స్ లేబొరేటరీలో తలసీమియా బాధితులకు ఉచితంగా చికిత్స అందిస్తామని డాక్టర్ మధుబాబు తెలిపారు. పీఆర్వో నరసింహరాజు పాల్గొన్నారు.

వర్కింగ్ ప్రెసిడెంట్‌గా గణేశ్



పాలకొల్లు అర్బన్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా తాను ఎన్నికైనట్టు పట్టణానికి చెందిన ముద్దాడ గణేష్ భవానీ ఆదివారం విలేకర్లకు తెలిపారు. నూతన కమిటీ నిర్మాణంలో భాగంగా రాష్ట్ర అధ్యక్షుడిగా బోను నరేష్, వర్కింగ్ అధ్యక్షుడిగా తాను, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలిగా భీమవరపు హేమ నియమితులు అయినట్టు తెలిపారు.



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షురాలు శ్రీదేవి

బూత్ కమిటీల్ని బలోపేతం చేయాలి

ఆచంట, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): బూత్ కమిటీల బలోపేతానికి కృషి చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షురాలు ఐనంపూడి శ్రీదేవి అన్నారు. బీజేపీ ఆచంట మండల కార్యకర్తల సమావేశం ఆదివారం మండల అధ్యక్షుడు నేదునూరి శ్రీనుబాబు అధ్యక్షతన జరిగింది. శ్రీదేవి ముఖ్య అతిథిగా మాట్లాడుతూ పార్టీ మండల అధ్యక్షుడిగా ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన శ్రీనుబాబును ఎన్నుకున్న కార్యకర్తలను అభినందించారు. నియోజక వర్గ కన్వీనర్ కె ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు అన్నసమారాధన

ఉండి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదపుల్లేరులో సత్తెమ్మ ఆలయ వార్షిక మహోత్సవం ముగింపు సందర్భంగా సోమవారం ఉదయం 11 గంటల నుంచి అఖండ అన్నసమారాధన జరుగుతుందని ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు కలిదిండి రామకృష్ణంరాజు, కలిదిండి భాస్కరరాజు తెలిపారు. ఆదివారం వివరాలను అందించారు.

ఈ ఏడాదైనా..

భీమవరం రూరల్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): వేసవి సమీపిస్తే తాగునీటి సమస్యను ప్రజలు ఎదుర్కొనే గ్రామాల్లో ప్రధాన గ్రామంగా భీమవరం మండలంలో పెదగరువు గ్రామం ఉంటుంది. జనాభా పెరిగినా మంచినీటి పథకం అభివృద్ధి చెందకపోవడంతో గ్రామ ప్రజలకు తాగునీటి ఇక్కట్లు తప్పడం లేదు. దశాబ్ద కాలం నుంచి గ్రామంలోని మంచినీటి చెరువు పూడికతీత జరగలేదు. చెరువు చిన్నది కావడంతో 2000 పైగా జనాభా ఉండటంతో తాగునీరు సరిపడా అందించలేకపోతున్నారు. వేసవిలో అయితే చెరువు పూర్తిగా నింపినా 20 రోజులకే నీరు అడుగంటుతుంది. దీంతో తాగునీరు కొనుగోలు చేసుకుని తాగాల్సి వస్తుంది. ప్రతి ఏటా తాగునీటి సమస్యను ప్రజలు ఎదుర్కొంటున్నా అధికార యంత్రాంగం దృష్టి పెట్టకపోవడం శోచనీయం. ఈ ఏడాదైనా మంచినీటి చెరువు అభివృద్ధి చేస్తారా? అని ప్రజలు ఎదురు చూస్తున్నారు.



- ప్రతి వేసవిలోనూ తాగునీటి వెతలే
- వేసవి మొదలైన 20 రోజులకే
- చిన్న చెరువు కావడంతో సరిపోని తాగునీరు
- దశాబ్ద కాలంగా పూడిక లేదు
- ఈ ఏడాదైనా అధికారులు చర్యలు చేపట్టాలని వినతి

పెదగరువులో మంచినీటి చెరువు

ఇంటర్వ్యూ..

6 పోలింగ్ బూత్‌ల ఏర్పాటు



రాజరాజేశ్వరి
తహసీల్దార్,
నరసాపురం

- ఎమ్మెల్సీ పట్టభద్రుల పోలింగ్‌కు ఎన్ని బూత్‌లు ఏర్పాటు చేస్తున్నారు?
  జవాబు: ఆరు బూత్‌ల ఏర్పాటు
- ఎక్కడెక్కడ బూత్‌లు ఉన్నాయి?
  జవాబు: టేలర్ హైస్కూల్‌లో మూడు, టేలర్ ఎలిమెంటరీలో ఒకటి, స్టీమర్‌రోడ్‌లోని యూపీ స్కూల్‌లో రెండు బూత్‌లు ఏర్పాటు చేశాం.
- ఎంత మంది ఓటర్లు ఉన్నారు?
  జవాబు: 5451 మంది. పురుషులు3090, మహిళలు 2361 మంది.
- కొత్త ఓట్లు చేరే అవకాశం ఉందా?
  జవాబు: జాబితా సవరణ తర్వాత 20 నుంచి 30 వరకు పెరగవచ్చు.

(ఆంధ్రజ్యోతి-నరసాపురం రూరల్)



భీమవరంలో అంజిబాబు, సీతారామలక్ష్మి ప్రచారం



కోరుకొల్లులో ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు



తాడేపల్లిగూడెంలో కరపత్రాలు అందిస్తున్న బాబ్జీ

ఎమ్మెల్సీగా రాజశేఖరాన్ని గెలిపించాలి

పట్టభద్రులకు కూటమి నాయకుల వినతి విస్తృత ప్రచారం

భీమవరం అర్బన్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరానికి మద్దతుగా భీమవరం సూర్యనారాయణపురంలోని 34, 36 వార్డుల్లో భీమవరం ఎమ్మెల్యే రామాంజనేయులు, టీడీపీ రాష్ట్ర పొలిట్ బ్యూరో సభ్యురాలు తోట సీతారామలక్ష్మి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం అన్ని రంగాల్లోను విఫలమై నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేకుండా చేసిందని కూటమి ప్రభుత్వం హామీలను నెరవేరుస్తోందన్నారు. సీతారామలక్ష్మి మాట్లాడుతూ మంత్రి లోకేశ్ అనేక పరిశ్రమలను రాష్ట్రానికి తీసుకొస్తూ ఉపాధి అవకాశాలు పెంపొందిస్తున్నారని, విజ్ఞతతో ఆలోచించి రాజశేఖరంను గెలిపించాలని కోరారు. ఎన్నికల పరిశీలకుడు, మాజీ ఎమ్మెల్సీ బుద్దా నాగ జగదీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వీరవాసరం/భీమవరం టౌన్: మండలంలోని మత్స్యపురిపాలెం, దూసనపూడి, బాలేపల్లి గ్రామాల్లో ఎమ్మెల్యే అంజిబాబు పట్టభద్రులను కలసి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరానికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఆయన వెంట టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోళ్ల నాగేశ్వరరావు, ఎంపీపీ వీరవల్లి దుర్గా భవాని, మండల పార్టీ ప్రెసిడెంట్ కొల్లెపర శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పాలకోడేరు: రాజశేఖరాన్ని అఖండ మెజారిటీతో గెలిపించి కూటమి పటిష్ఠతను మరోసారి రుజువు చేయాలని టీడీపీ కోరుకొల్లు గ్రామ నాయకుడు గాదిరాజు శ్రీనివాసరాజు అన్నారు. కోరుకొల్లులో పార్టీ నాయకులతో కలసి ఆయన ప్రచారం నిర్వహించారు. సీఎం చంద్రబాబు నాయుడు కూటమి పక్షాన రాజశేఖరంను నిలబెట్టారని, మొదటి ప్రాధాన్యత ఓటును వేసి గెలిపించాలని కోరారు. టీడీపీ నాయకులు అన్నెపు అప్పారావు, ప్రసాద్, గేదెల రమణ, రామ్మోహన్, కాసు, శివ, కృపావరం, సోమరాజు తదితరులు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం అర్బన్: కూటమితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి అన్నారు. పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరంను భారీ మెజారిటీతో గెలిపించాలని పట్టణంలో ఆదివారం ప్రచారం నిర్వహించారు. కరపత్రాలను పంపిణీ చేశారు. పట్నాల రాంపండు, పద్మనాభుని మురళి, సబ్బీసు కృష్ణమోహన్, కంచుమర్తి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

మొగల్తూరు: రాజశేఖరాన్ని గెలిపించాలని కోరుతూ టీడీపీ, జనసేన నాయకులు గ్రామాల్లో విస్తృత ప్రచారం నిర్వహించారు. నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ పొత్తూరి రామరాజు, మండల అధ్యక్షుడు నాగరాజు ప్రచారాల్లో పాల్గొన్నారు.

ఉండి: రాజశేఖరంను గెలిపించాలని టీడీపీ మండల అధ్యక్షుడు కరిమెరక నాగరాజు అన్నారు. ఆదివారం ఉణుదుర్రులో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్టీ గ్రామ అధ్యక్షుడు బండారు వీరరాఘవులు, జనసేన మండల కన్వీనరు యడవల్లి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


దమ్మయ్యపర్తి డ్రెయిన్‌కు మోక్షం

- రూ. 14 కోట్లు మంజూరు
- మంత్రి నిమ్మల రామానాయుడు



దమ్మయ్యపర్తి మేజర్ డ్రెయిన్ గట్ల వద్ద మంత్రి పరిశీలన

పాలకొల్లు అర్బన్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని దమ్మయ్యపర్తి మురుగు డ్రెయిన్ పనులకు వైసీపీ కనీసం అర్ధ రూపాయి ఖర్చుపెట్టలేదని, ఒక బస్తా సిమెంట్ పని చేయలేదని రాష్ట్ర జలవనరుల శాఖమంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు అన్నారు. ఆదివారం డ్రెయిన్ గట్ల వెంబడి ఆయన కూటమి నాయకులు, సంబంధిత అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ డ్రెయిన్ అభివృద్ధికి రూ. 14 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసిందని, పనులు సత్వరమే మొదలు పెట్టి పూర్తి చేసే విధంగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ డ్రెయిన్ పట్టణ పరిధిలో 15 వార్డులకు ఉపయోగ పడుతుందని, డ్రెయిన్ పూడికతో కొద్దిగా వర్షం పడినా పట్టణ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. గత టీడీపీ హయాంలో ఈ పనులకు రూ. 7.40 కోట్లు మంజూరు కాగా సుమారు రూ.70 లక్షల పనులు జరిగాయని, ఈ నేపథ్యంలో జగన్ అధికారంలోకి రావడంతో పనులు నిలిచిపోయాయన్నారు. మాజీ ఎమ్మెల్సీ అంగర రామమోహన్, కూటమి నేతలు పెచ్చెట్టి బాబు, గండేటి వెంకటేశ్వరరావు, కర్నేన గౌరునాయుడు, దనాని శ్రీరామమూర్తి, జక్కంపూడి కుమార్, లక్ష్మీనారాయణ, విన్నకోట గోపి, ఎం. ఫకీర్ బాబు, చినమిల్లి గణపతిరావు, బిరుదుకోట శేఖర్, అధికారులు పాల్గొన్నారు.



చదరంగంతో మేధస్సు పెంపు: ఆరిమిల్లి

ఇరగవరం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): చదరంగం క్రీడ మేధస్సును పెంచుతుందని తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. ఇరగవరం మండలం ఏలేటిపాడులో ఆదివారం లక్ష్మీ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో మండల స్థాయి చదరంగం పోటీలు నిర్వహించారు. చెస్ మాస్టర్ కుడిపూడి చరణ్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో 350 మంది విద్యార్థులు పాల్గొనగా 36 మంది విజేతలుగా నిలిచారు. వీరు ఈ నెల 23న తణుకు రోటరీ క్లబ్‌లో జరిగే జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారని వివరించారు. విజేతలకు ఆరిమిల్లి బహుమతులు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యేను అకాడమి సభ్యులు ఘనంగా సత్కరించారు.



పెంటపాడులో ఆత్మీయ సమ్మేళనం



ఆకివీడు జడ్పీ పాఠశాలలో..

అపూర్వ సమ్మేళనం

అత్తిలి జూనియర్ కళాశాల పూర్వ విద్యార్థి, నిర్మాత అచ్చిరెడ్డికి సత్కారం



అత్తిలిలో నిర్మాత, పూర్వ విద్యార్థి అచ్చిరెడ్డికి సత్కారం

పెంటపాడు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): పెంటపాడు పోస్టుబేసిక్ ప్రభుత్వ పాఠశాలలో 1983-84 సంవత్సరం టెన్త్ బ్యాచ్ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. కుటుంబాలతో సహా హాజరై అలనాటి స్మృతులను జ్ఞప్తికి తెచ్చుకున్నారు. తమకు చదువు నేర్పిన గురువులు కృష్ణమోహన్, లక్ష్మణాచార్యులతో పాటు తాము చదువుకున్నప్పటి నుంచి ఇప్పటి వరకు కూల్‌డ్రింక్ బండి నడుపుతున్న అచ్యుతం అనే వ్యక్తిని సత్కరించారు. పాఠశాలకు కంప్యూటర్ సమకూర్చుతామని ప్రస్తుత హెచ్ఎం రాజేష్‌కు తెలిపారు. ఏర్పాట్లను నల్లమిల్లి విజయానందరెడ్డి, మేడపాటి పల్లారెడ్డి, దాసరి వెంకట సత్యనారాయణ, మీసాల శ్రీనివాస రావు, కొలుకూరి రమేష్, రాంకుమారి, ఆనందకుమారి పర్యవేక్షించారు.

ఆకివీడు: స్థానిక జిల్లా పరిషత్ బాలురు ఉన్నత పాఠశాల 1970-71 పదవ తరగతి బ్యాచ్ విద్యార్థులు ఆదివారం పాఠశాలలో కలుసుకున్నారు. నాటి స్మృతులను నెమరు వేసుకున్నారు. కొందరు మనుమలతో కలిసి ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సత్కరించారు. పాఠశాలకు లక్షల్లో ఆర్థిక సహాయం అందచేశారు. కొట్టు ఆంజనేయులు, గొంట్లా సత్యనారాయణ, మద్దాల రామారావు, కనుమూరి లక్ష్మీపతిరాజు, సింగవరపు కోటేశ్వరరావు, ప్రేమ్‌కుమార్, అజాజ్ ఇక్బాల్, వేగేశ్న రవిచంద్ర, ఎస్‌కేఎం సిస్టీ, ఎంకేఎం సిస్టీ, కొనగంచి సూర్యనారాయణ, బండారు వెంకటలక్ష్మి, చక్కా కుమారి తదితరులు పాల్గొన్నారు.

అత్తిలి: అత్తిలి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 1971-73 సంవత్సరాలలో ఇంటర్మీడియట్ చదివిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం అత్తిలి షాదీఖానాలో నిర్వహించారు. తమతో చదువుకున్న ప్రముఖ నిర్మాత కొవ్వూరి అచ్చిరెడ్డిని సత్కరించారు. ఈ సందర్భంగా పోలిశెట్టి చంటి మాట్లాడుతూ స్నేహబంధం ఇలాగే కొనసాగాలన్నారు. పూర్వ విద్యార్థుల తరపున జడ్పీ కో ఆప్షన్ సభ్యుడు హబీబుద్దీన్, ఏఎంసీ మాజీ ఛైర్మన్ పోలిశెట్టి చంటి, దిరిశాల ప్రసాద్, చిన్నం లక్ష్మణరావు ఆధ్వర్యం వహించారు.

ఉచిత ఆక్యుపంచర్

నరసాపురం టౌన్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వీవర్స్ కాలనీలో ఆదివారం కొవ్వలి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత ఆక్యుపంచర్ వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వైద్యులు కొండా శ్రీధర్ 100 మందికి ఆక్యుపంచర్ వైద్యాన్ని అందించారు. సంకు భాస్కర్, సూరిబాబు, ముత్యం, లక్ష్మణ్, స్వామి పాల్గొన్నారు.

రైల్వే బోర్డు మెంబర్‌గా పెద్దిరాజు

నరసాపురం రూరల్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): విజయవాడ డివిజన్ రైల్వే బోర్డు మెంబర్‌గా చిట్టవరం గ్రామానికి చెందిన బీజేపీ నాయకుడు నడిపూడి పెద్దిరాజు నియమితులయ్యారు. పెద్దిరాజు మండల అధ్యక్షుడిగా పనిచేస్తున్నారు. ఆదివారం బీజేపీ నాయకులు ఆయనను ఘనంగా సత్కరించారు. ఆ పార్టీ కన్వీనర్ మేకల సతీష్ మాట్లాడుతూ కష్టించి పనిచేసేవారికి సముచిత స్థానం ఉంటుందన్నారు.

ఢిల్లీ ఘటన బాధాకరం : వర్మ

భీమవరం టౌన్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ రైల్వే స్టేషన్‌లో విషాద ఘటన తన మనస్సును కలచివేసిందని కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ అన్నారు. ఈ ఘటనలో మృతి చెందిన వారి కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నానని క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని దేవుడిని ప్రార్థిస్తున్నానని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు.

ఉచిత వైద్య సేవలు

తణుకు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, నిసా ఫౌండేషన్ సంయుక్తంగా నిర్వహించే సంచార శకటం ద్వారా ఉచిత వైద్య సేవలు ఆదివారం నిర్వహించారు. ప్రముఖ నేత్ర వైద్యుడు డాక్టర్ హుస్సేన్ అహ్మద్, డాక్టర్ నిమ్మగడ్డ అచ్యుతరామయ్య మండపాక, పైడిపర్రు, సజ్జాపురం ప్రాంతాల్లో పర్యటించి 8 మందికి వైద్య సేవలందించారు. సంఘ కార్యదర్శి ఎండీ స్వావహ ఆర్థిక సాయంతో ఉచితంగా మందులు అందజేశారు. సంఘ సభ్యులు పాల్గొన్నారు.

'దిడ్ల'కు మద్దతుగా ప్రచారం

భీమవరం అర్బన్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి దిడ్ల వీరరాఘవులును గెలిపించాలని కేవీపీఎస్ రాష్ట్ర కమిటీ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే దిగుపాటి రాజగోపాల్ పిలుపునిచ్చారు. ఆదివారం ఆయన వీరరాఘవులను గెలిపించాలని ప్రచారం చేశారు. కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.క్రాంతిబాబు, జిల్లా కమిటీ సభ్యులు కింతాడ రమేష్, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు గాతల జేమ్స్ తదితరులు పాల్గొన్నారు.

ఆకతాయిలకు కౌన్సెలింగ్

పెనుమంట్ర, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): మార్టేరు సెంటర్‌లో రాత్రిపూట సరైన కారణం లేకుండా బైక్‌లపై విపరీతంగా హారన్‌లు మోగిస్తూ ప్రజలకు అసౌకర్యం కలిగిస్తున్న యువకులను పోలీసులను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వారికి కౌన్సిలింగ్ ఇచ్చి వదిలివేశారు.



మల్లన్న పాగాకు పూజలు



కలశాలతో ఊరేగింపుగా మారెలమ్మ దర్శనానికి మహిళలు



పాలకొల్లులో సూర్యభగవానుడికి అభిషేకాలు



విద్యాగణపతి



కాళ్లకూరులో శ్రీవారికి రఘురామ పూజలు



ముత్యాలమ్మకు అంజిబాబు పూజలు



కుంచనపల్లిలో శ్రీవారి కల్యాణం

మల్లన్న పాగా గ్రామోత్సవం

పాలకొల్లు అర్బన్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): మల్లన్న పాగాకు ఆదివారం ప్రత్యేక పూజల అనంతరం గ్రామోత్సవం నిర్వహించారు. 18 అడుగుల వెడల్పు, 360 మూరల పొడవు గల పాగాను దగ్గులూరుకు చెందిన వరదా సోమేశ్వరరావు దంపతులు పవిత్రంగా నేసి క్షీరారామలింగేశ్వర స్వామికి అందజేయడం ఆనవాయితీ. పాగాను మహాశివరాత్రి రోజు లింగోద్భవ సమయంలో ఆలయ గాలి గోపురం నుంచి ఆలయ శిఖరానికి అలంకరిస్తారు.

కల్యాణం.. కడు రమణీయం

తాడేపల్లిగూడెం రూరల్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లిగూడెం మండలం కుంచనపల్లిలో శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠోత్సవాల్లో భాగంగా శ్రీవారి కల్యాణం శనివారం రాత్రి కన్నుల పండువగా సాగింది. భక్తులు పెద్ద సంఖ్యలో వీక్షించారు. ప్రసాద వితరణ జరిగింది.

సూర్యభగవానుడికి అభిషేకాలు

పాలకొల్లు అర్బన్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): మాఘమాసం ఆదివారం సందర్భంగా స్థానిక కోడిగట్టున ఉన్న సూర్య దేవాలయంలో స్వామి వారికి అర్చకులు కొత్తలంక సుబ్రహ్మణ్యం ఆవు పాలతో అభిషేకాలు నిర్వహించారు. వందలాది మంది భక్తులు స్వామిని దర్శించుకున్నారు.

సూర్యదేవాలయానికి భక్తుల తాకిడి

ఆధ్యాత్మికం

తణుకు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సూర్యదేవాలయంలో స్వామి వారి దర్శనానికి భక్తులు ఆదివారం పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఆలయ అధికారులు ముందస్తు ఏర్పాట్లు చేయడంతో భక్తులతో ఎలాంటి అసౌకర్యం కలగలేదు. స్వామి వారికి విశేష అర్చనలు, పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

కాళ్ళకూరులో రఘురామ పూజలు

కాళ్ళ, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): స్వయంభూ కాళ్ళకూరు వేంకటేశ్వరస్వామికి డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామకృష్ణరాజు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు ఆలయ మర్యాదలతో ఆయనకు స్వాగతం పలికి స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని స్వామివారిని కోరుకున్నట్టు తెలిపారు. ఆయన వెంట టీడీపీ సీనియర్ నాయకుడు మంతెన పెద నరసింహరాజు, మండలాధ్యక్షుడు జీవీ నాగేశ్వరరావు, ఉండి వాటర్ డీసీ ఛైర్మన్ తోట ఫణిబాబు, అడ్డాల శివరామరాజు, నాగరాజు, వంశీ పాల్గొన్నారు.

ముత్యాలమ్మ జాతరలో అంజిబాబు..

భీమవరం రూరల్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తుందుర్రులో జరుగుతున్న ముత్యాలమ్మ, మారెమ్మ, మహాలక్ష్మమ్మ వార్ల 63వ జాతర మహోత్సవంలో ఎమ్మెల్యే అంజిబాబు పాల్గొని అమ్మవార్లకు పూజలు చేశారు. 62 ఏళ్ళుగా జాతర మహోత్సవాలను నిర్వహించడం విశేషమన్నారు. అనంతరం ఆలయ ఈవో, గ్రామపెద్దలు ఎమ్మెల్యేను సత్కరించారు.

మొగల్తూరు: ముత్యాలపల్లి బండి ముత్యాలమ్మ ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఇతర జిల్లాల నుంచి కూడా వేలాదిమంది భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఈవో మోకా అరుణ్ కుమార్, ట్రస్టుబోర్డు సభ్యులు భక్తులకు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

240వ సూర్యహోమం

పాలకొల్లు అర్బన్: లోక కళ్యాణార్థం, కరోనా అంతం కావాలని కోరుతూ స్థానిక శ్రీసరస్వతి శిశు మందిరంలో ఆదివారం సూర్యహోమం నిర్వహించారు. కరోనా ప్రారంభం అయినప్పటి నుంచి ప్రతి ఆదివారం సూర్యహోమం నిర్వహిస్తున్నామని, ఇది 240వ హోమం అని నిర్వాహకులు తెలిపారు. వేదపండితులు సూర్య నమస్కారాలు, శాంతి హోమం, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మారెలమ్మ ఉత్సవాలు ప్రారంభం

ఉండి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): కలిసిపూడిలో మారెలమ్మ ఉత్సవాలు ప్రారంభం సందర్భంగా కలశాలు ఊరేగింపు వైభవంగా జరిపారు. అనంతరం మహిళలు కలశాలతో వచ్చి అమ్మవారిని పూజించారు.

విద్యాగణపతికి పూలతో అలంకారం

భీమవరంటౌన్, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి) : సంకటహర చతుర్థిపురస్కరించుకుని గునుపూడిలోని విద్యాగణపతిని పూలతో ప్రత్యేకంగా అలంకారంచేసారు. ఉదయం స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి గణపతి హోమం నిర్వహించారు. సాయంత్రం విశేషపూజలు చేసిన అనంతరం మండ చేతన్ సౌజన్యంతో పూలతో అలంకారం చేసారు. భక్తులు దర్శించుకున్నారు.